




గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

వార్త... మెయిన్‌లో

చిరు వ్యాపారుల గగ్గోలు



ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ప్రభుత్వం విధించిన ఛార్జీలు చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పళ్ల రసాలు, పాన్‌షాపులు, చిన్న చిన్న హోటళ్లు, సెలూన్ షాపులకు భారీగానే ఛార్జీలు పెరిగాయి. అసలే అంతంతమాత్రంగా వ్యాపారాలు చేస్తున్న తమకు ఇంతేసి మొత్తంలో బిల్లులు రావడం చూసి నిర్ఘాంతపోతున్నారు. రిఫ్రిజిరేటర్లు వినియోగించకపోయినా వేసవి కాలంలో వచ్చిన మాదిరిగా బిల్లులు వస్తున్నాయంటూ వాపోతున్నారు. రోజు వారీ వ్యాపారంలో వచ్చిన లాభమే కరెంట్ బిల్లుల రూపంలో చెల్లిస్తే తాము బతికేదెలా అని వారు వాపోతున్నారు.

- పెరిగిన కరెంట్ బిల్లులతో వినియోగదారుల షాక్
- కొన్నిచోట్ల వేసవి తరహాలో బిల్లులు
- వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఛార్జీలు
- కరెంట్ వాడకం తగ్గినా బిల్లులు పెరగడంపై ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 7,87,601 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 6,69,106 గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు, 65,647 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 2,398 పరిశ్రమలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వీధిదీపాలు, రక్షిత మంచి నీటి కనెక్షన్లు 20,233 ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన కరెంట్‌పై ప్రజల నుంచి మొదట విడతగా రూ.6072.86 కోట్లను ఛార్జీల రూపంలో వసూలు చేసేందుకు ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ డిస్కమ్‌లను అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిఇపిడిసిఎల్) అధికారులు డిసెంబరు నుంచే అమలు చేయడం ప్రారంభించారు.

వేసవి కాలం కంటే ఎక్కువ బిల్లు



వేసవి కాలంలో మాకు ఫ్రిడ్జ్ వాడకం వల్ల రూ.1300 నుంచి రూ.1400 మధ్య బిల్లు వచ్చేది. ఇప్పుడు ఫ్రిడ్జ్ వాడకపోయినా ఈనెలలో అదనంగా రూ.350 వచ్చింది. కరెంట్ ఛార్జీలు ఇలా పెరిగితే ఏం వ్యాపారాలు చేస్తాం. బిల్లులు ఇలాగే పెరిగితే షాపులు నిర్వహించలేం.

- లండ ధర్మారావు, స్వీట్ షాప్ యజమాని, నందిగాం

వ్యాపారాలు కష్టమే



మాకు నవంబరులో రూ.1780 బిల్లు వచ్చింది. శీతాకాలం కావడంతో పెద్దగా కరెంట్ వాడలేదు. అయినా కరెంట్ బిల్లురూ.1960 వచ్చింది. చలికాలంలోనే బిల్లులు ఎక్కువ వస్తే ఇక వేసవి కాలంలో బిల్లులు ఎంత పెరుగుతాయోనన్న భయమేస్తోంది.

- పి.రమణమూర్తి, పాన్‌షాప్ యజమాని, నందిగాం

బిల్లులో ఎఫ్‌పిపిపిసిఎ-1 పేరుతో అదనపు రుసుము విధిస్తున్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల నుంచి చిన్నపాటి పాన్‌షాపుల వరకు ఇచ్చిన కరెంట్ కనెక్షన్లను వాణిజ్య సర్వీసులుగా పరిగణించి ఆ మేరకు టారిఫ్ విధిస్తున్నారు. డిసెంబరు నెలకు సంబంధించిన కరెంట్ బిల్లుల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది.

భారీ పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలపై ప్రత్యక్షంగా వాటిపై భారం పడినా, పరోక్షంగా సామాన్యులపైనే పడనుంది. పరిశ్రమలపై విద్యుత్ భారం పడితే, యాజమాన్యాలు ఆ మేరకు వస్తువులపై ధరలను పెంచే అవకాశాలు ఉన్నాయి. వాహన విడిభాగాలు, మందుల తయారీ పరిశ్రమలు ఆమేరకు ధరలను పెంచి నష్టాలను అధిగమించే అవకాశాలూ లేకపోలేదు. కార్పొరేట్ సంస్థలపై పడే ప్రతి భారం తిరిగి సామాన్యులపైనే పడనుంది. హోటళ్లపై భారం పడితే భోజన, అల్పాహార ధరలను పెంచే అవకాశం లేకపోలేదు. గతంలో విద్యుత్ ఛార్జీలు పెంపు, నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిన ప్రతి సందర్భంలోనూ యాజమాన్యాలు ధరలను పెంచాయి. పిండిమిల్లులు, రుబ్బు మిషన్ల నిర్వాహకులు వసూలు చేసే ధరను పెంచే అవకాశాలున్నాయి. ఇలా ఏవిధంగా చూసుకున్నా ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల అంతిమ భారం సామాన్యులపై పడనుంది.

వాణిజ్య కనెక్షన్లపై రూ.అర కోటి భారం

చిన్న, మధ్యతరహా పరిశ్రమల నుంచి చిన్నపాటి పాన్‌షాపుల వరకు ఇచ్చిన కరెంట్ కనెక్షన్లను వాణిజ్య సర్వీసులుగా పరిగణించి ఆ మేరకు టారిఫ్ విధిస్తున్నారు. జిల్లాలో మొత్తం 65,647 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గత నెలలో ఈతరహా కేటగిరీపై రూ.11.85 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ఇంధన సర్దుబాటు ఛార్జీలు అమలు కావడంతో, ఐదు నుంచి ఆరు శాతం వరకు ఆదాయం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో నెలకు సుమారు రూ.అర కోటి వరకు అదనపు నెలకు ఆదాయం రానుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు వస్తుందని అంచనా వేస్తున్నారు.

జిల్లాలో ధాన్యం ఆరబెట్టే పరిశ్రమ ఏర్పాటు

- ధాన్యం కొనుగోలులో తేమ శాతం పెంపు
- 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - లావేరు

శ్రీకాకుళంలో రూ.40 కోట్లతో ధాన్యాన్ని ఆరబెట్టే పరిశ్రమను నెలకొల్పుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ పరిశ్రమ వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. లావేరు మండలంలోని కలిశెట్టి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అక్కడే ధాన్యం కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని స్పష్టం చేశారు. రైతుల ఇబ్బందులు చూసి ధాన్యం కొనుగోలు నిబంధనల్లో రైతులకు పూర్తి ప్రయోజనం కలిగేలా మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారని చెప్పారు. అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోలులో తేమ శాతాన్ని పెంచామన్నారు. 17 శాతానికి మించి తేమ ఉంటే ధాన్యం కొనక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో, ఆ విధానంలో మార్పులు చేశామని చెప్పారు. ధాన్యంలో 25 వరకు తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా నిర్ణయించుకుంటే, సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నులను శ్రీకాకుళం జిల్లా నుంచే సేకరిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, అక్కడే విక్రయించాలన్నారు. వాట్సాప్‌లో రైతు హాయ్ అని మెసేజ్ పెడితే వ్యవసాయ శాఖకు సంబంధించిన మొత్తం సమాచారం అందేలా ఎఐ టెక్నాలజీని రూపొందించామన్నారు. దీనివల్ల వ్యవసాయానికి సంబంధించిన అన్నిరకాల సలహాలు, సాగులో మెళకువలు తెలుసుకోవచ్చని చెప్పారు. జిల్లా నుంచి వలసల నివారణ ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మడ్డువలస, తోటపల్లి కాలువలను ఆధునికరించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో రైతులకు ధాన్యం కొనుగోలు కింద రూ.36 కోట్లు వారి ఖాతాలో జమ చేశామని చెప్పారు. సుమారు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ఉద్దానాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం

- ఎయిర్‌పోర్టు కోసం బలవంతపు భూసేకరణ ఆపాలి
- రైతులకు అండగా 12న గ్రామాల్లో పర్యటన
- వామపక్ష నాయకుల వెల్లడి

ప్రజాశక్తి - పలాస

ఉద్దాన ప్రాంతాన్ని కాపాడుకోవడానికి మరో ఉద్యమం తప్పదని వామపక్ష నాయకులు సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వేణు, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 12న ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత గ్రామాల్లో వామపక్ష నాయకులు పర్యటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని విమర్శించారు. గతంలో అభివృద్ధి పేరుతో ఈస్ట్‌కోస్ట్ పవర్ ప్లాంట్‌కు ప్రభుత్వం 2020 ఎకరాల భూమిని ఇస్తే, ఆ కంపెనీ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని దివాళా పిటిషన్ వేసిందని గుర్తుచేశారు. దీంతో ప్రభుత్వం ఆక్షన్ వేసి లాజిస్టిక్ కంపెనీకి రూ.26 కోట్లకు కారుచౌకగా కట్టబెట్టిందని విమర్శించారు.

జిల్లా సస్యశ్యామలం కావాలంటే వంశధార ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.వెయ్యి కోట్లు కేటాయించి, చివర భూముల వరకు నీరందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో ఏడాదిలో రెండు పంటలు పండి ప్రజల ఆదాయం పెరుగుతుందని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెరిగి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వం కోరుకుంటోంది కార్పొరేట్ అభివృద్ధా?, ప్రజల అభివృద్ధా? అని ప్రశ్నించారు. సమావేశంలో వామపక్ష నాయకులు జి.గోవింద్, బి.తిరుపతి, జుత్తు వీరాస్వామి, మద్దిల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనకరంగా...

బయోటెక్నాలజీరంగ ఆవిష్కరణలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

శాస్త్ర, వైద్య, పర్యావరణ, వ్యవసాయ తదితర రంగాలకు బయోటెక్నాలజీ అధ్యయనాలు బహుళ ప్రయోజనకరంగా నేడు మారుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యాన 'బయోటెక్నాలజీలో ఆవిష్కరణలు-వైద్య శాస్త్రం, ప్రపంచ ఆరోగ్యంలో పరిణామాలు' అనే అంశంపై సోమవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. మానిటోబా యూనివర్శిటీ హెల్త్ సైన్స్ విభాగం (కెనడా) ఆధ్యాపకులు ప్రొఫెసర్ చెలికాని ప్రసేన్ మాట్లాడుతూ సాంకేతిక ప్రగతితో, బయోసైన్స్ పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయన్నారు. బయోటెక్నాలజీ రంగం ఆవిష్కరిస్తున్న నూతన వ్యాక్సిన్లు పలు వ్యాధులకు అడ్డుకట్టు వేసేందుకు నేడు దోహదపడుతున్నాయన్నారు. వర్చువల్ విధానంలో అలబామా యూనివర్శిటీ (అమెరికా) హేమటాలజీ, అంకాలజీ విభాగం అధ్యాపకులు జి.పూర్ణచంద్ర నాగరాజు మాట్లాడుతూ అంతర్లీనంగా అభివృద్ధి చెందుతున్న పలు రకాల కేన్సర్లకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యామ్నాయ మార్గాలపై చేస్తున్న పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్ రజని మాట్లాడుతూ జన్యు సంబంధిత వ్యాధులు చేధించడానికి మరిన్ని మెరుగైన పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల నిర్మూలనకు బయోటెక్నాలజీలో జరుగుతున్న పలు నూతన ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సదస్సు కన్వీనర్, వర్శిటీ రిజిస్ట్రార్ పి.సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు పి.ఎస్.పి ధనుంజయ, వర్శిటీ రెక్టార్ బి.అడ్డయ్య, వర్శిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయ భాస్కర్, ఎం.అనురాధ, సిహెచ్.రాజశేఖరరావు, విభాగం అధ్యాపకులు ఎన్.లోకేశ్వరి, కె.స్వప్నవాహిని తదితరులు మాట్లాడారు.



ప్రొఫెసర్ ప్రసేన్‌ను సత్కరిస్తున్న బిఆర్‌ఎయు విసి రజని తదితరులు

11, 12న జిల్లాలో వర్షాలు

- కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారే నేపథ్యంలో జిల్లాలో ఈనెల 12, 12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశముందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా పరిషత్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 12వ తేదీ తర్వాతే వరి కోతలు, నూర్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు. కోతలు కోసినవి ఉంటే వెంటనే కుప్పలు పెట్టుకోవాలన్నారు. ధాన్యం నూర్చి కళ్ళాల్లో సిద్ధంగా ఉన్నట్లు తెలియజేస్తే ధాన్యం సేకరణకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 54 వేల టన్నులు ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో ఉన్నట్లు వెల్లడించారు. పది వేల టన్నుల ధాన్యం రెండు రోజుల్లో వస్తుందని అంచనా ఉందన్నారు. 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో 30 వేల టన్నులు కొనుగోలు చేయవచ్చని చెప్పారు. మరో 34 వేల టన్నుల ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలన్నారు. పంటను కాపాడుకునేందుకు పౌర సరఫరాల శాఖ నుంచి టార్పాలిన్లు కొనుగోలు చేసి ధాన్యం కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. నూర్చిన ధాన్యం సిద్ధంగా ఉంటే జిల్లాలో 402 ధాన్యం సేకరణ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే ఆ కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో చెల్లింపులు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 4.9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.1 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసినట్లు వివరించారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లకు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు. తడిచిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టి విక్రయించాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వంతెనల నిర్మాణ పనులు చేపట్టాలి

శ్రీకాకుళం అర్బన్ : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేసిన వంతెనల పనులను సత్వరమే చేట్టాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ అతిథిగృహ ఛాంబరులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాహుదా నదిపై, బారువ కొండి రేవుపై, మహేంద్రతనయ నదిపై నిర్మించతలపెట్టిన వంతెన పనులకు టెండరు ప్రక్రియను పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరారు.


నరసన్నపేట - ఇచ్ఛాపురం హైవేను...

ఆరు లైన్లకు విస్తరించాలి

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగమయ్యేలా జిల్లా మీదుగా ఉన్న 16వ నంబరు జాతీయ రహదారిని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అందుకనుగుణంగా నరసన్నపేట - ఇచ్ఛాపురం మధ్య ఉన్న జాతీయ రహదారిని ఆరు లైన్లకు విస్తరించాలని సూచించారు. హైవే అధికారులతో విశాఖపట్నంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి సమీక్షించారు. ఇప్పటికే విశాఖపట్నం - నరసన్నపేట వరకు వంద కిలోమీటర్ల మేర ఆరు లైన్ల జాతీయ రహదారి ఉందని, ఒడిశా సరిహద్దు ఇచ్ఛాపురం వరకూ ఇదే విధంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు. దీనివల్ల ప్రయాణం, సరుకు రవాణా వేగవంతం చేయవచ్చని చెప్పారు. దీంతోపాట నూతనంగా నిర్మాణం కానున్న భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టును అనుసంధానం చేసేలా విశాఖపట్నం - మూలపేట బీచ్ కారిడార్ రోడ్డు ప్రతిపాదనలపై పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే.. జిల్లాలోని మత్స్యకార గ్రామాలను జాతీయ రహదారితో కలపడంతో పాటు ఎగుమతులు పెరిగి.. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచవచ్చని వివరించారు. దీంతోపాటు శ్రీకాకుళం నగరంలోకి వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా నవభారత్ జంక్షన్ నుంచి బైపాస్ వరకు ఉన్న జాతీయ రహదారిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన హైవే అధికారులు... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనుల వేగవంతానికి కృషి చేస్తామని తెలిపారు.



సమీక్షిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పక్కన ఎమ్మెల్యే శంకర్

'మీకోసం'కు 71 వినతులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం)కు జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 71 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఉప కలెక్టర్ అప్పారావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజాతో కలిసి వినతులు స్వీకరించారు. జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికల నేపథ్యంలో పాత ఓటర్ల జాబితాల్లో మృతి చెందిన ఓటర్లను తొలగించడంతో పాటు వారి వారసులను కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కోరారు. పలువురు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో స్థానిక రైతులే ఓటర్లుగా ఉండాలని, ఆయకట్టుకు సంబంధం లేకుండా ఓటర్ల జాబితాలో రైతులను చేర్చడం, మృతి చెందిన రైతుల పేర్లు తొలగించకుండా జాబితాలో కొనసాగించడం సరికాదన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల కోసం వాహనాలను అద్దె ప్రాతిపదికన వినియోగించారని, అద్దె మొత్తాలు నేటికీ చెల్లించలేదంటూ బాలాజీతో పాటు పలువురు టాక్సీ యజమానులు, డ్రైవర్లు ఫిర్యాదు చేశారు. తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరారు. సంతబొమ్మాళి మండలంలో మూలపేట పోర్టు పునరావాస కాలనీకి భూములు ఇచ్చిన రైతుల్లో కొందరికి పరిహారం చెల్లించలేదని, సాంకేతిక కారణాలు చూపిస్తూ చెల్లింపులు నిలుపుదల చేశారని ఆకాశలఖవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఫిర్యాదు అందజేశారు. ఈ సమస్యను సరిచేయాలని కోరారు.



హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గార మండలం శ్రీకూర్మంలో ఈనెల ఆరో తేదీన జరిగిన హత్య కేసులో గ్రామానికి చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. ఉప్పాడ రాములమ్మకు చెందిన 1.40 ఎకరాల భూమిని మృతుడు రాజేష్ సహకారంతో ఉప్పాడ సూర్యనారాయణ, చుక్కా రాము, అనపాన షణ్ముఖరావు కొనుగోలు చేశారనే కక్షతో దాడి చేశారని తెలిపారు. కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దారికాచి దాడి చేయడంతో రాజేష్ మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన చుక్కా రాము కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. దాడి నుంచి రామును కాపాడడానికి వచ్చిన ఆయన భార్య సరోజని గాయాలపాలైందని, దాడి నుంచి ఉప్పాడ సూర్యనారాయణ తృటిలో తప్పించుకున్నారని తెలిపారు. 2018లో భూవివాదం నేపథ్యంలోనే సూర్యనారాయణపై కొయ్య భాస్కరరావు కుటుంబసభ్యులు దాడి చేశారని తెలిపారు. ఇప్పటికీ ఈ కేసు న్యాయస్థానంలో ఉందన్నారు. దాడిలో ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్న కొయ్య భాస్కరరావు, కొయ్య రమేష్, కొయ్య లోకేష్, కొయ్య సాయికిరణ్, కొయ్య గురయ్య, గుజ్జు లక్ష్మణ, గుజ్జు రామారావు, గుజ్జు శ్రీనును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నామన్నారు. వీరి నుంచి దాడికి ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని, వీరిపై రౌడీషీట్ తెరవనున్నట్లు తెలిపారు.

అదుపులో కాపర్ దొంగలు

గార పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రైమెక్స్ పాటు సరుబుజ్జిలి, బొబ్బిలిలో రూ.27 లక్షలు విలువైన కాపర్ ప్లేట్స్, ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కేబుల్‌ను చోరీ చేసిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. కొమరవానిపేటకు చెందిన కొమర తారకేశ్వరరావుతో పాటు గాజువాక (గంట్యాడ)కు చెందిన కదిరి హరీష్, గడ్డపాటి తిలక్, చెన్ను చంటి కలిసి ట్రైమెక్స్ రూ.26 లక్షలు, సరుబుజ్జిలి, బొబ్బిలి పోలీస్ స్టేషన్ల పరిధిలో రూ. లక్ష విలువైన కాపర్ కేబుల్స్ చోరీ చేసి వాటిని గాజువాకలోని పైలా ప్రకాష్ అనే స్క్రాప్ నిర్వాహకునికి విక్రయించినట్లు గుర్తించామన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించి వారి నుంచి 772 కేజీల కాపర్ ప్లేట్లను, కేబుళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ కాపర్‌ను కొనుగోలు చేసిన స్క్రాప్ నిర్వాహకుడు పైలా ప్రకాష్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో సిఐ పైడపునాయుడు, గార ఎస్ఐ జనార్ధనరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



పొందూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

భూ రీ సర్వే పేరుతో గత వైసిపి ప్రభుత్వం ఆ పార్టీ నాయకులు భూ ఆక్రమణలకు, అక్రమాలకు, కబ్జాలకు పాల్పడ్డారని, వీటిని వెలికితీసేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మండలంలోని గోరింటలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రీ సర్వే పేరుతో అమాయకుల భూములను ఆక్రమించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో ఇటువంటి తప్పిదాలను సవరించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్, సర్పంచ్ శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు సిహెచ్.రామ్మోహన్, కూన సత్యనారాయణ, ఎ.రాము, ఎస్.శ్రీరంగనాయకులు, బి.శంకరభాస్కర్, సిహెచ్.వాసుదేవరావు, వరదరాజులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు అన్నారు. మండలంలోని కణుగులవలసలో తహశీల్దార్ రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాతిన గడ్డయ్య, సర్వేయరు బొడ్డేపల్లి గోవిందరావు, విఆర్ఒ నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కామవుతాయని తహశీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేటలో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామంలో వ్యవసాయ భూములు కన్నా... ఎక్కువగా వాణిజ్య భూములు ఉండడంతో అనేక భూ సమస్యలు ఉన్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ స్పందిస్తూ... మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సదస్సులో పలువురు పలు భూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పి.తవిటయ్య, భూ రీ సర్వే డిటి కిరణ్ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహశీల్దార్ వెంకటరావు


స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎస్.ఎస్.ఆర్ పురంలో పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఎస్.ఎస్.ఆర్.పురంలో తప్పుడు ధ్రువపత్రాలతో అనర్హులు పింఛన్లు అందుకుంటున్నట్లు ఫిర్యాదు రావడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం తనిఖీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో లబ్ధిదారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 40 మంది వివరాలు సేకరించారు. ఈ మేరకు గ్రామంలో వృద్ధాప్య పింఛన్లు 216, వికలాంగ పింఛన్లు 49, ఒంటరి మహిళల పింఛన్లు 96, డప్పు కళాకారులు పింఛన్లు ఏడు, అభయహస్తం పింఛన్లు 28, అవి వివాహితులు 22 ఉన్నాయని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, ఎంపిడిఒ హరిహరరావు, ఎంఇఒ పున్నయ్య పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎఎస్‌పి రమణ

సమస్యల పరిష్కారానికి చర్యలు

అదనపు ఎస్‌పి రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని అదనపు ఎస్‌పి కె.వి.రమణ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 64 వినతులను స్వీకరించారు. అనంతరం వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా తక్షణమే తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

నేడు పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ నెల 10న డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ కవితా సంపుటి ఖాకీ చొక్కా పుస్తక పరిచయ సభ జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరం నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తక పరిచయ సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అర్చకులు వి.జి.కె.మూర్తి, కవి కంచరాన భుజంగరావు తదితరులు పాల్గొంటారని అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పెరుగుతున్న అంతరాలు, అణచివేత ఈ అంశంపై స్వీయ కవితా పఠనం చేయాల్సిందిగా జిల్లాలోని కవులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు 'గరిమెళ్ల కవితా స్రవంతి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- పోలాకి

విజయనగరం అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రచురించిన 'గరిమెళ్ల కవితా స్రవంతి' అనే పుస్తకాన్ని మండలంలోని ప్రియాగ్రహారం గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరిస్తున్నట్లు గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు బాడానరాజు, ఐ.గణపతిరావు, డి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ రచించిన అభ్యుదయ కవితలన్నీ విజయనగరం అభ్యుదయ రచయితల సంఘం గరిమెళ్ల కవితా స్రవంతి పేరిట ప్రచురించారని అన్నారు. 'మాకొద్దీ తెల్లదొరతనం' పేరుతో రాసిన నాటికనూ పరిచయం చేస్తామన్నారు. అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు, కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విజయనగరం జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గిడుగు రామ్మూర్తి జానపద కళా పీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు, ఎన్.ఈశ్వరరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.నాగకుమారి, ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వేశ్వరరావు అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. సాహితీ అభిమానులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు ప్రయోజనకరంగా కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని గోరింటలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో ఆ పార్టీ నాయకులు చేతివాటం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతులు తమకు అనుకూలమైన రైస్ మిల్లులుకు బదులు ప్రభుత్వం ఎక్కడో సూచించిన రైస్‌మిల్లుకు ధాన్యం విక్రయం చేయాల్సి రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. దూరంగా ఉన్న మిల్లుకు దాన్యం తరలించడంతో రైతులపై రవాణా ఛార్జీల భారం పడేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు అనుకూలమైన, సమీపంలో రైస్ మిల్లుకు విక్రయించుకునే వెసులబాటు కల్పించారని అన్నారు. తేమ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ధాన్యం విక్రయించిన రెండు మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్ రామానుజులు, వ్యవసాయశాఖ ఎడి శ్రీనివాసరావు, సర్పంచ్ సిహెచ్.శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్.రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, సిహెచ్.వాసుదేవరావు, అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కర్, కె.నాగేశ్వరరావు, పి.వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్మయ్య పోరాటం ఆదర్శం

టెక్కలి : ఉద్యమ ఉపాధ్యాయ నాయకులు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభ యుటిఎఫ్ టెక్కలిశాఖ ఆధ్వర్యాన స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద నిర్వహించారు. ముందుగా లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, సత్తారు రాంబాబు, డొంకన పాపారావు, కురుమాన దాలయ్య, మారం కుమారస్వామి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య జీవితం ఉపాధ్యక్షులకు ఆదర్శప్రాయమని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొట్నూరు జగదీశ్వరరావు, కాపల నారాయణరావు, బమ్మిడి ఆనందరావు, బాడాన నారాయణరావు, కె.సుధారాణి, భారతి, మోహిని పాల్గొన్నారు.

సేవల్లో యువత భాగస్వామ్యం అవసరం

శ్రీకాకుళం అర్బన్ : స్వచ్ఛందంగా సేవ చేసేందుకు రెడ్‌క్రాస్‌లో యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.శివశంకర్ అధ్యక్షతన యూత్ రెడ్‌క్రాస్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత విద్యతో పాటు సమాజ సేవకు ముందుండాలని కోరారు. ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, వైస్ ప్రిన్సిపల్ వేణు, మోహనరావు, చైతన్యకుమార్, ఉమాశంకర్, పవన్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో పాత పెట్రోల్ బంకు వద్ద సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గరికిపాలెంకు చెందిన తలసముద్రం పాటయ్య (67) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన స్కూటీలో పెట్రోల్ కొట్టుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా... శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం తరలిస్తుండగా... పరిస్థితి విషమించి మార్గంమధ్యలో మృతి చెందారు. పాటయ్య విశ్రాంతి రైల్వే ఉద్యోగి. స్వగ్రామం సంతబొమ్మాళి మండలం ములకివానివలస. ఏడేళ్లుగా భార్య పిల్లలతో గరికిపాలెంలో నివసం ఉంటున్నారు. ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురం కూడలి జాతీయ రహదారిపై సోమవారం వ్యాన్ ఢీకొని వ్యాన్ దిచక్రవాహన దారుడు గాయపడ్డాడు. విజయనగరం జిల్లా చిన్ననడిపల్లికి చెందిన కుప్పిలి విక్రమ్‌సాయి బుడుమూరు వైపు నుంచి బైక్‌పై రణస్థలం వైపు సర్వీసు రోడ్డులో వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ బెజ్జిపురం వద్ద వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో విక్రమ్‌సాయి తీవ్రంగా పడడంతో స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిందితుడిని ప్రవేశపెట్టిన సిఐ చిన్నంనాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారని సిఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని సోమవారం విలేకరులత ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని లొద్దపుట్టి పరిధిలోని తులసమ్మ ఆలయం జాతీయ రహదారి ఫ్లఓవర్ బ్రిడ్జి కింద బిద్య సాగర్ సింగ్ 14.450 కిలలో గంజాయితో పట్టుబడినట్టు పేర్కొన్నారు. ఒడిశా నుంచి కేరళ రాష్ట్రానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. బరంపురం నుంచి బస్సులో ఇచ్ఛాపురానికి చేరుకుని, ఇక్కడి నుంచి రైలులో కేరళ తరలించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. సాగర్‌సింగ్‌ను అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

8 కేజీల గంజాయితో వ్యక్తి...

పాతపట్నం : మండలంలోని కాపుగోపాలపురం శివారున నడుచుకుంటూ వెళ్తున్న సంజయ్ బద అనే వ్యకి అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామని సిఐ వి.రామారావు తెలిపారు. ఆయన వద్ద నుంచి 8,132 కిలోల గంజాయి, రూ.500 నగదు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ మేరకు నిందితుడిని పోలీస్‌స్టేసన్‌లో విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.లావణ్య పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

ఆమదాలవలస : అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆదివారం అర్ధ రాత్రి నాగావళి నది నుంచి అక్రమ తవ్వకాలు చేపట్టి లారీ ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందిందని అన్నారు. వెంటనే వెంటనే రాత్రి రెండు గంటల సమయంలో కొత్త రోడ్డు సమీపంలో ఇసుక లారీని నిలుపుదల చేసి పత్రాలను పరిశీలించామ న్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేనందున లారీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. సీజ్ చేసిన ఇసుక లారీని జిల్లా గనుల శాఖ అధికారులకు అప్పగించామని అన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం


పట్టుబడిన సారా ప్యాకెట్లు

ఇచ్ఛాపురం : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వాహనాలను సోమవారం తనిఖీ చేస్తుండగా... ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 300 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేశామని సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఒడిశాకు చెందిన లాబన్య దలేయి బైక్‌పై సారా ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డారని అన్నారు. దలేయిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎస్ఐ వి.రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో హరిశ్చంద్రపురం వాసి మృతి


సత్యనారాయణ (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురానికి చెందిన పిడుగు సత్యన్నారాయణ (63) తిరుపతిలో గుండెపోటుతో మృతి చెందాడు. అయ్యప్ప స్వాములతో కలిసి ఈ నెల 4న సత్యనారాయణ శబరమలై వెళ్లారు. దర్శనం అనంతరం తిరుపతి చేరుకున్నారు. అక్కడ ఆదివారం అస్వస్తతకు గురికావడంతో స్నేహితులు ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య భవాని, కుమారుడు జీవన్‌కుమార్, కుమార్తె రమాదేవిలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మీ కోసం'

పలాస : సమస్యల పరిష్కారానికే మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు, శానిటేషన్, టిడ్కో ఇల్లు, పుట్టిన ధ్రువపత్రాలు, పింఛన్లు వంటి పలు సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

బీల రైతుల కష్టాలు


నీటి నుంచి చేనును తీస్తున్న చేస్తున్న కూలీలు


పొలాల్లో నీటిని బట్టి ద్వారా మళ్లిస్తున్న రైతులు

ప్రజాశక్తి- కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇంటికి తెచ్చుకునేందుకు పుటియాదల బీల రైతు అష్టకష్టాలు పడుతున్నాడు. పొగురు పారకపోవడంతో పొలాల్లో నీటిని మళ్లించేందుకు చెమటోడుస్తున్నాడు. మరోవైపు మళ్లీ వర్షాలు వస్తాయంటూ వాతావరణశాఖ ప్రకటనతో ఇప్పటికే పూర్తిగా పండిన పంటను పైపైనే కోసి వేరే చోటికి తరలిస్తున్నారు అరకొర రైతులు. దీంతో ఇప్పటికే పెరిగిన సాగు ఖర్చులు రైతులకు భారమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పుడు రెండింతలు ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు. అయినా పూర్తి పంట ఇంటికి వస్తుందో? లేదో? ఆందోళన చెందుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

చాప కింద నీరులా విస్తరిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని అదుపు చేయాలంటే ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని పొందూరు సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి నుంచి పురవీధుల్లో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, ఐసిటిసి కౌన్సిలర్ నాగవల్లి, టెక్నికల్ అసిస్టెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దుస్తుల పంపిణీ


కంచిలి : దుప్పట్లు పంపిణీ చేస్తున్న గణపతి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో ది న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ఎర్త్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన సోమవారం వికలాంగులకు దుస్తులను పంపిణీ చేశారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ 25 వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కరకవలస వినీలభాయి, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, కరుణాకర్, భాస్కర్, పొన్నాడ రుషీ, ఆళ్ల ఇందుమతి పాల్గొన్నారు.

కంచిలి: పరోపకారమే మనిషితత్వం కావాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షుడు, మనోవికాస నిపుణుడు రామ్ బుడ్డి గణపతి అన్నారు. సీతయ్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో సోమవారం 30 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు. సొండిల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావుతో కలిసి వృద్ధులకు దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గుల్ల రమేష్, గుల్ల మోహన్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి హయంలో ఉద్దానం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పెద్దమురహరిపురం ఎంపిటిసి గొరకల వసంతరావు అన్నారు. ఉపాధి హామీలో భాగంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.8.50 లక్షలతో 250 మీటర్ల సిసి రోడ్డును నిర్మిస్తున్నామని అన్నారు. సిసి రోడ్ల నిర్మాణాలతో గ్రామాల్లో అనుసంధానం పెరుగుతుందన్నారు. పనులు నిబంధనలు మేరకు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు గర్తం దానేసు, మండల ఇంజినీర్ బి.నాగభూషణం, టిడిపి మండల యువ నాయకుడు గొరకల గోపాలకృష్ణ, గొరకల జోగారావు, సాంకేతిక సహాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడాకారులు ఆటల్లో రాణించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. క్రీడా పోటీల్లో బహుమతులు సాధించిన క్రీడాకారులకు విశాఖ-ఎ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అభినందించారు. సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీలో బంగారు పతకం సాధించిన బూరవెల్లికు చెందిన దూబ యామశ్రీని, స్కూల్ గేమ్స్ అండర్-19 సిల్వర్ మెడల్ సాదించిన తాళాసు కావ్యను, స్కూల్ గేమ్స్ అండర్-19 బ్రాంచ్ మెడల్ సాధించిన పట్నాన చంద్రశేఖర్‌లు ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. వీరితో పాటు కోచ్ ఇప్పిలి అప్పన్న, గుజ్జల హిమగిరి ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కోటబొమ్మాళి: ఉపాధ్యాయ శిక్షణ సంస్థ వమరవెల్లిలో సోమవారం జాతీయస్థాయి కళాఉత్సావ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ సాధించారు. జిల్లాస్థాయి జానపద నృత్య విభాగంలో చుక్క ఊర్వశి, పట్నాన దివ్యశ్రీలు ద్వితీయ స్థానం, 2డి ఆర్ట్ విభాగంలో పట్నాన దివ్యశ్రీకి ద్వితీయ స్థానం లభించింది. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, డైట్ ప్రిన్సిపాల్ గౌరిశంకర్‌లు విద్యార్థులను, గైడ్ టీచర్ షణ్ముఖరావును అభినందించారు.

కళా ఉత్సవ పోటీల్లో...

కవిటి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ - 2024 పోటీల్లో పాల్గొన్న కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరు విభాగాల్లో పాల్గొని ఐదు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. జానపద నృత్యం గ్రూపు, జానపద గీతం గ్రూపు, డ్రామా గ్రూపు, 3డి ఆర్ట్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూపు విభాగాల్లో ప్రభుత్వ పాఠశాల కవిటి విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన పిబికె శర్మ, యు.గిరిబాబు, ఎన్.ఏకాంబరీశ్వర శర్మలను ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ తెప్పల మోహనరావు, కవిటి సర్పంచ్ లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధుబాబు, బెందాళం రమేష్, బెందాళం తిరుమల కుమార్ అభినందించారు.


కోటబొమ్మాళి : విద్యార్థులతో డిఇఒ తిరుమల చైతన్య

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదనిఎస్ఐ బి.నిహార్ అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల , పాఠశాల విద్యార్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంకల్పం మాదకద్రవ్యాలకు వ్యతిరేకగా పోరాడుదాం అనే కార్యక్రమంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు డ్రగ్స్ అలవాట పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వాని నుంచి కుటుంబాలు రోడ్డున పడుతున్నారని అన్నారు. అలాగే సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ముందస్తు ప్రణాళికతో పబ్లిక్ పరీక్షల్లో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జిన్నారావు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణమూర్తి, హెచ్ఎం హరిబాబు, ఉమ్మారావు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిహార్

పాతపట్నం : సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. స్థానిక ఎస్‌సి బాలుర హాస్టల్‌లో సోమవారం సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడకంపై అవగాహన చేపట్టారు. విద్యార్థులు, యువకులు తెలిసి తెలియని వయసులో అనేక రకాలుగా వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, మీ గ్రామాలకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే విధంగా ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేయాలని సూచించారు.

నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలి

నందిగాం : జిల్లాలోని గొర్రెలకు, మేకలకు నట్టల నివారణా మందులను తక్షణమే పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిన సాంబమూర్తి కోరారు. ఈ మేరకు నందిగాంలో సోమవారం విలేకరులతో మాటాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గొర్రెలు, మేకలకు పిపిఆర్ వ్యాక్సిన్ వేయాలన్నారు. గొర్రెల సహకార సొసైటీల ద్వారా ఎన్‌సిడిసి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెల పెంపకం దారులకు విత్తన పొట్టేలను సబ్సిడీపై అందించాలన్నారు. సబ్సిడీపై రేకుషెడ్లు మంజూరు చేయాలన్నారు.

కక్షపూరిత చర్యలు విడనాడాలి

టెక్కలి: కూటమి ప్రభుత్వం కక్షపూరిత చర్యలను విడనాడి ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని నీటి సంఘ మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. కాకినాడలో పిడిఎస్ బియ్యం, పట్టుకోవడం, విశాఖ డెయిరీ ఫారం కేటాయించిన భూములపై విచారణ, భూ కుంభకోణాలు వంటి వాటిపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టినా పాలనను గాడీలో పెట్టలేకపోయారని అన్నారు. భూ కుంభకోణాలపై విచారణ చేపట్టి వారి పేర్లను బయటపెట్టాని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన అమలవుతుందని వ్యాఖ్యానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వినీష ఎంపిక


వినీష

పొందూరు: రాష్ట్రస్థాయి 2024-25లో ఆన్‌లైన్ కౌశల్ క్విజ్ పోటీలకు పొందూరు ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని యం.వినీష ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌశల్ క్విజ్ పోటీలో పదో తరగతి నుంచి ఒక్కరే ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థినికి గైడ్ టీచర్‌గా బొటనీ ఉపాధ్యాయులు జి.జీవన్‌బాబు వ్యవహరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

యోగికి పురస్కారం


వాబ యోగి

టెక్కలి : ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు వాబ యోగికి ప్రజా యుద్ధనౌక గద్దర్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారని అవార్డు నిర్వహణ కమిటీ సభ్యులు ఎ.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ఈ అవార్డు డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పిగన్నవరంలో అందజేయనున్నట్లు వెల్లడించారు. గద్దర్ కుమార్తె వెన్నల చేతుల మీదుగా ఈ అవార్డు అందజేస్తారని అన్నారు. పేదలు తరుపున పాలకులతో పొరాడే నాయకులకు ఈ అవార్డుకి ఎంపిక చేస్తారని తెలిపారు. వాబ యోగి అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఎపిలో అదానీతో జరిగిన ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ నియోజకవర్గ నాయకులు సిహెచ్.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. అదాని అవినీతి వ్యవహారంపై తహశీల్దార్ కార్యాలయంలో డిటి లక్ష్మీనారాయణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అదాని కుంభకోణంతో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదాని గ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ కాపిటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలన్నారు. ఇందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లోని హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో జి.గోవింద్, తిరుపతిరావు, జె.జోగారావు, టి.రవి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు


కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కార్పొరేషన్ కమిషనర్ వి.ఎస్.ఎస్.డి.ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలో సోమవారం ఉదయం సుడిగాలి పర్యటన చేపట్టారు. పిఎన్ కాలనీ, పాలకొండ రోడ్డు, తురాయి చెట్టు వీధి, పుప్పాల వారి వీధి, పెద్ద రెల్లి వీధి, విశాఖ-బి కాలనీ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. చెత్త నిల్వలు రోడ్లపై, కాలువల్లో లేకుండా నిరంతరాయంగా తొలగించాలని ఆదేశించారు. ఆయనతో పాటు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

బాధితులను ఆదుకుంటాం

రణస్థలం రూరల్ : మండలంలోని తెప్పలవలస పంచాయతీ సీతారాంపురంలో ఆదివారం తెల్లవారి జామున సంభవించిన అగ్నిప్రమాదంలో అరసవల్లి సత్యనారాయణకు చెందిన కార్పెంటరీ షాపు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితులను ఓదార్చారు. ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు పిన్నింటి భానోజీ నాయుడు, మాజీ సర్పంచ్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, కలిశెట్టి రామారావు, మజ్జి వెంకటరమణ, కొయ్యి రామారావు, లంక రఘు, కోటి, కరాటే లక్ష్మణ్ ఉన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం చంద్రబాబు

వధూవరులకు సిఎం ఆశీర్వాదం

పాతపట్నం : పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు డాక్టర్ మామిడి సాయి గణేష్, డాక్టర్ దుర్గ వైష్ణవిల వివాహ నిశ్చితార్థం విశాఖలో ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు విజయవాడలోని సిఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులను సోమవారం తీసుకున్నారు. కాబోయే వధూవరులను సిఎం ఆశీర్వదించారు.

మొక్కలు వితరణ

పాతపట్నం : స్థానిక ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ డేను పురస్కరించుకొని పదో తరగతి చదువుతున్న వడాన హేమాని తండ్రి గంగాధర్ పాఠశాలకు 10 అలంకరణ మొక్కలను సోమవారం వితరణగా అందజేశారు. ఈయన ఇంతకుముందు పాఠశాలకు ఒక బీరువా, కళాశాల వసతిగృహానికి వితరణగా అందజేశారు. యాజమాన్య కమిటీ సభ్యునిగా ఉన్న గంగాధర్ పాఠశాల అభివృద్ధికి నిరంతరం ఏదో ఒకరకంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ప్రిన్సిపల్ రత్నకుమారి తెలిపారు. గంగాధర్‌కు వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు అభినందించారు.


మొక్కలను అందజేస్తున్న గంగాధర్

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పలాస : గతేడాది స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన పలాస కళాశాల విద్యార్థిని నిహారిక స్ఫూర్తితో ఈ ఏడాదీ ఉత్తమ ఫలితాలు సాధించాలని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి అన్నారు. సంకల్ప్ -2025లో భాగంగా కళాశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం అధ్యాపకులు చేస్తున్న ప్రణాళికాబద్ధ బోధనకు తోడుగా ఇంటివద్ద తల్లిదండ్రులూ బాధ్యత చూపాలన్నారు. సంకల్ప్‌లో భాగంగా విద్యార్థులను ఎ,బి,సి గ్రేడ్‌లుగా విభజించి, సి-గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి గ్రూప్ కేర్ టేకర్ ఆయా విద్యార్థుల తల్లిదండ్రులతో వారి పిల్లల విద్యా పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఎజిఎంసి బి.వెంకటమోహన్, గ్రంథాలయ అధ్యాపకుడు పి.చిరంజీవులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహమూర్తి


శ్రీకాకుళం అర్బన్ : కేక్ కట్ చేస్తున్న కృష్ణారావు

సోనియాగాంధీ జన్మదినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజ్యసభ సభ్యులు, ఎఐసిసి మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఇందిరా విజ్ఞాన్ భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణారావు, నగర అధ్యక్షులు రెల్ల సురేష్‌లు పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఇందులో భాగంగా జెండాల వీధికి చెందిన షేక్ బాషా బాబు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మామిడి సత్యనారాయణ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, గార మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు, బగ్గు రాము, అంబటి రామకృష్ణ, గంగు కొండలరావు, అంబటి రాజారావు, అనుపోజు రవికుమార్, పాలవలస రమేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని మునగవలసలో బొత్స వెంకటరమణ సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి దాలయ్య, గుంటుబారిక అప్పారావు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందని, పల్లెపల్లెల్లో రహదారుల నిర్మాణం శరవేగం అవుతుందని టిడిపి నాయకులు గొనప సంతోష్, శమల్ల సర్వేశ్వరరావు, జనసేన నాయకుడు లోల్ల సాగర్ అన్నారు. మండలంలోని బి.జి.పుట్టుగ పంచాయతీ కొర్రాయిపుట్టుగ, చెవిటిపుట్టుగ గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు కనీస వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అందులో భాగంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రవి, కృష్ణమూర్తి, ఇంద్రారావు, మహేష్, రామానందం పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నాయకులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరుణాకరరావు

ఫిబ్రవరి వరకు పశుగణన

పాతపట్నం: ప్రతి ఒక్క విషయ సేకరణ దారుడు (ఎన్యూమరేటర్లు) కచ్చితంగా తనకు కేటాయించిన ఇళ్లని సర్వే చేయాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నం, మెలియాపుట్టి మండలాల్లో 21 అఖిలభారత పశుగణన చేపడుతున్నామని అన్నారు. పాతపట్నంలో ఏడుగురు, మెళియాపుట్టిలో ఐదుగురు ఎన్యూమరేటర్లు ఈ సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సర్వేలో పశువైద్యాధికారి డాక్టర్ పి.అనిల్, ఒడిరి కుమార్, విజయకుమార్, నారాయణ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు సందర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మహిళా సంఘాలకు ఖాతాలపై మండలంలోని రాజపురంలో యూనియన్ బ్యాంకు అధికారులతో వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు చర్చించారు. ఈ మేరకు సోమవారం బ్యాంకును సందర్శించారు. ఈ బ్యాంకు పరిధిలోని స్వయం శక్తి సంఘాలకు సంబంధించి ఉమెన్ లెటర్ రుణాలు, పిఎంఎఫ్ఎంఇ, పిఎంజిపి, ముద్ర, బ్యాంకు లింకేజీ రుణాలు గురించి మాట్లాడారు. ఈయనతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ మూర్తి, విఓఎలు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- జలుమూరు

విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆలోచనతో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని దరివాడలో మన బడి - మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా రూ. 36 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, ఎంపిపి వాన గోపి, టిడిపి మండల అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు భైరి భాస్కరరావు, వెలమల చంద్రభూషణ్, మునికోటి దాంబాబు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ మన్మథ, గుండ మన్మథ పాల్గొన్నారు.


చెరువు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ పరిధిలోని టి.మన్నయ్యపేటలో చెరువు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెరువులను విస్మరించడంతో రైతులకు సాగునీరు అందకుండా ఇబ్బందులు పడ్డారన్నారు. కాలువల్లో పూడికతీత పనులు కూడా చేపట్టకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి కాలువల్లో పూడికలు తీయించి, చెరువులను బాగు చేయించి రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన ప్రభుత్వ, ఆదిత్య ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మానవ హక్కులు, వాటి పరిరక్షణ, యువత మాదకద్రవ్య దుర్వినియోగం, పరిణామాలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇచ్ఛాపురంలోని ప్రధాన సమస్యలు, అభివృద్ధి అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నియోజకవర్గ ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీలో కోట రామారావు, కె.సి.పూరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్ పాఢి, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

ముమ్మరంగా టిడిపి సభ్యత్వం

సారవకోట : ముమ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ తెలిపారు. మండలంలోని కొత్తూరు, రైవాడ గ్రామాల్లో సోమవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం రూ.వంద సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం టిడిపి కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో వరుధు గోవిందరావు, చల్ల వామనమూర్తి, మెండ పాపారావు పాల్గొన్నారు.